నగరంలో-నేడు

- బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని ఖండిద్దాం.. హిందువులకు బాసటగా నిలబడుదాం.. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం 1 గంటలకు సమావేశం
- వయనాడ్ - ఉత్తరాఖండ్ - హెచ్‌పీ - హైదరాబాద్‌లో ప్రకృతి విపత్తులు..? మ్యాన్‌మేడ్ ఫెల్యూయర్స్..? అనే అంశాలపై జనవిజ్ఞాన వేదిక స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రౌండ్ టేబుల్ సమావేశం
- తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జువెనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హైకోర్టు సీ బ్లాక్ ఆవరణలో ఉదయం 10 గంటలకు హ్యాండ్లూమ్ ఆర్టికల్స్ స్టాల్స్ ప్రారంభించనున్న హైకోర్టు జస్టిస్ సుజయ్ పాల్, తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ

ప్రమాదకరమైన కేబుళ్లను తొలగించండి

- **గుట్టలుగా ఉన్న కేబుల్స్‌తో వంగిపోతున్న స్తంభాలు**
- **టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ**

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో ప్రధాన రహదారుల పక్కన విద్యుత్ స్తంభాలపై ప్రమాదకరంగా గుట్టలుగా ఉన్న కేబుళ్లను వారంలో, ఇతర రహదారుల్లో ఉన్న వాటిని రెండు వారాల్లో తొలగించాలని కేబుల్ ఆపరేటర్లను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూకీ ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం కేబుల్ ఆపరేటర్స్, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ సంస్థల ప్రతినిధులు, కేబుల్ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ స్తంభాలపై నిబంధనల ప్రకారం కేబుళ్ల ఏర్పాటు చేసుకోవాలని ఆపరేటర్లకు సూచించారు. కరెంట్ స్తంభాలపై సామర్థ్యానికి మించి కేబుల్స్, తీగల బండిల్స్ పలు రకాల టెలీకాం పరికరాలను వేలాడదీయడంతో స్తంభాలు వంగిపోతున్నాయన్నారు. కేబుల్స్ చిందరవందరగా రోడ్లపైకి వేలాడుతూ ఫుట్‌పాత్‌లపై పడుతుండటంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. సెక్షన్ల వారీగా పనిచేయని కేబుళ్లను తొలగించేందుకు క్షేత్రస్థాయి అధికారులతో కేబుల్ ఆపరేటర్స్, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లతో సమావేశాలు నిర్వహించి తీగలు తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎండీ ఉన్నతాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ కె.రాములు, సుధారాణి, జోనల్ చీఫ్ ఇంజనీర్లు కె.సాయిబాబా, నరసింహస్వామి, పి.ఆనంద్, బిక్షపతి, సీఈఓ నారాయణ, కేబుల్ సంఘాల నాయకులు, ఇంటర్నెట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి
కవితా పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు అల్వాల బాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా జాతీయ స్థాయి కవితా పోటీల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నవభారత నిర్మాణ సంఘం అధ్యక్షుడు సూరేపల్లి రవికుమార్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు వివిధ రాష్ట్రాలలో ఉన్న తెలుగు ప్రజలు ఈ కవితా పోటీలలో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. ఈ పోటీలకు పంపించే కవిత 20 నుంచి 25 వరసలు మాత్రమే ఉండాలని, తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కవితా పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.2,116, ద్వితీయ బహుమతి రూ.1,616, తృతీయ బహుమతి రూ.1,116, ప్రోత్సాహక బహుమతుల కింద రూ.516 నగదు ప్రదానం చేయనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కవితలను ఈ నెల 20వ తేదీలోపు వాట్సాప్ నంబర్ 6303732862కు పంపించాలని పేర్కొన్నారు.

10, 11 తేదీల్లో జేఎన్‌టీయూ క్యాంపస్‌లో
మెగా జాబ్‌మేళా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, జేఎన్‌టీయూ, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ, హెచ్‌ఆర్ కో ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పరవస్తు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో ఐటీ, ఫార్మా, ఐటీఈఎస్, మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ, రిటైల్ రంగాలకు చెందిన 100కు పైగా సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని అన్నారు. ఈ జాబ్‌మేళాలో 10 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే అవకాశముందన్నారు. కనీసం 10వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు ఇందులో ఉచితంగా పాల్గొనవచ్చని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

పిల్లల పోషకాహారంలో మార్పులు అవసరం

- **యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ జెలాలెమ్ టాఫెసర్**

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలోపు చిన్నారులకు అందించే పోషకాహార పద్ధతుల్లో మరిన్ని మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ జెలాలెమ్ టాఫెసర్ అన్నారు. యూనిసెఫ్, సీఎస్‌బీసీ(సెంటర్ ఫర్ సోషల్ అండ్ బిహేవియరియల్ చేంజ్) సంయుక్తంగా హెచ్‌సీయూలో బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. చిన్నారులకు మంచి పోషకాహారాన్ని అలవాటు చేయడం, వారి జుట్టు దువ్వడం, స్నానం చేయడం వంటి ప్రవర్తనల్లో చేయాల్సిన మార్పులను రూపకల్పన చేసేందుకు ఈ వర్క్‌షాప్ ఎంతగానో దోహదపడిందని అన్నారు. వర్క్‌షాప్‌లో యూనిసెఫ్ ప్రతినిధులతో పాటు తెలంగాణ రాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ అధికారులు, పోషకాహార నిపుణులు, క్షేత్ర పరిశోధకులు పాల్గొని పరిపూర్ణమైన ఆహార పద్ధతులను ప్రోత్సహించడానికి వ్యూహాలను రూపొందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆదిలాబాద్, కామారెడ్డి, గద్వాల జిల్లాల్లో చేసిన క్షేత్ర పరిశోధనల్లో వెలుగుచూసిన అంశాలపై విస్తృతంగా చర్చించామని ఆయన తెలిపారు. వర్క్‌షాప్‌లో ప్రొఫెసర్ వాసుకి బెలవాడి, ఉషా రామన్, డాక్టర్ రవికాంత్, ఆదిత్య లోమాస్ సీమా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్లకే దారిదోపిడీలు, రౌడీషీట్

- **ఐదుగురి అరెస్టు**

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): 20 ఏళ్లకే దొంగతనాలు, దారిదోపిడీలకు పాల్పడుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ రౌడీషీటర్ సహా.. ఐదుగురిని సౌత్‌వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కుల్సుంపురా పోలీసులు కలిసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. కామాటిపురాకు చెందిన చౌకత్ ఆకాశ్ 20 ఏళ్లకే హత్యకేసు, దారిదోపిడీ కేసులో అరెస్టయ్యాడు. దాంతో అతనిపై రౌడీషీట్ నమోదైంది. ఆ తర్వాత మరో నలుగురు స్నేహితులు పర్వా విశాల్‌సింగ్, బిరదారా కిషన్‌రావు రోహిత్, సకత్ జితేందర్, గున్నాల ప్రదీప్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వారంతా 20 ఏళ్ల యువకులే. నగరంలో అర్ధరాత్రి తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి కత్తులతో బెదిరించి దారిదోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో అర్ధరాత్రి స్నేహితునితో కలిసి వెళ్తున్న డెలివరీ బాయ్‌ని అడ్డగించి కత్తులతో బెదిరించి, గాయపరిచి వారి నుంచి సెల్‌ఫోన్‌లు, నగదును లాక్కున్నారు. దాంతో సౌత్‌వెస్టు జోన్ పోలీసులు రంగంలోకి దిగి నిఘా పెట్టి రౌడీల ముఠాను పట్టుకున్నారు.

ఐపీఓ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో
రూ. 6.14 లక్షలు లూటీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఐపీఓలలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని ఆశ పెట్టిన సైబర్ నేరగాళ్లు నగరవాసి(58) నుంచి రూ. 6.14 లక్షలు కాజేశారు. నగరవాసిని వాట్సాప్‌లో సంప్రదించిన సైబర్ నేరగాళ్లు ఐపీఓలో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించారు. ఇలా పలు సంస్థల ఐపీఓలలో పెట్టుబడుల పేరుతో రూ. 6.14 లక్షలు పెట్టించారు. పెట్టిన పెట్టుబడికి లాభాలు వచ్చాయని చూపారు. లాభాలు తిరిగి పెట్టుబడిగా పెట్టాలని సైబర్ నేరగాళ్లు ఒత్తిడి చేశారు. తన డబ్బులు విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో బాధితుడు సైబర్ నేరగాళ్లను సంప్రదించాడు. ఖాతాలో ఉన్న డబ్బులో 10 శాతం చెల్లిస్తేనే విత్‌డ్రాకు అవకాశం ఇస్తానని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'స్వచ్ఛదనం-పచ్చదనాన్ని' విజయవంతం చేయాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్**

సరూర్‌నగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడ, నాదర్‌గుల్, కుర్మల్‌గూడ గ్రామాల్లో జరుగుతున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ జీ.రఘుతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలను, బడంగ్‌పేట్‌లోని పాలిటెక్నిక్ కాలేజీని సందర్శించి అక్కడి సమస్యలపై విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ప్రతిమాసింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, గూడెపు ఇంద్రసేన, మునిసిపల్ డీఈఈ యాదయ్య, ఏఈలు బిక్కూనాయక్, వినీల్‌గౌడ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


గుర్రంగూడలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మేయర్ పారిజాతారెడ్డి తదితరులు

వనస్థలిపురం : బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ హరిహరపురం కాలనీలోని ఫారెస్ట్‌లో దోమల పెరుగుదలను అరికట్టడానికి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్‌ను వేశారు. బతుకమ్మకుంటలో పేరుకపోయిన చెత్త, పిచ్చి చెట్లను తొలగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, డీసీ తిప్పర్తి యాదయ్య, పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


తొర్రూర్‌లో మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్ అనురాధరాంరెడ్డి

సరూర్‌నగర్‌లో..

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్‌లోని వెంకటేశ్వరకాలనీలో తులసీ, ఉసిరి, గోరింటాకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీసీ సుజాత శ్రీధర్, హార్టికల్చర్ డీఈ చంద్రశేఖర్, సత్యనారాయణ, నీలిమ పాల్గొన్నారు.

లింగోజిగూడలో..

సరూర్‌నగర్ చెరువులో పేరుకపోయిన చెత్త, గుర్రెపు డెక్కలను తొలగించారు. గుర్రెపు డెక్కలు పెరగకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. అదేవిధంగా లింగోజిగూడ డివిజన్‌లో దోమల నివారణకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీసీ జానకీ సుల్తానా, శానిటేషన్ డీఈ వెంకటేశం, అధికారులు రజిని, మున్నా, కృష్ణవేణి, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చంపాపేట: చంపాపేట డివిజన్‌లోని బైరామల్‌గూడ చెరువు పరిసరాలలో బుధవారం జీహెచ్ఎంసీ, ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ డీసీ జాకియా సుల్తానా, శానిటేషన్ డీఈ వెంకటేష్, యూబీడీ మేనేజర్ సత్యనారాయణ, వార్డు ఆఫీసర్ శ్రీనివాస్, ఎంటమాలజీ ఏఈ మని కాలనీల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి : చైర్‌పర్సన్ అనురాధ

హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కొహెడా, కమ్మగూడ, రాగన్నగూడ, తొర్రూర్, ఉమర్‌ఖాన్‌గూడ వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ స్వచ్ఛ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీరునిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఇంటికి ఒక్క మొక్క నాటాలని కోరారు. ఈ సందర్భంగా కొహెడా వార్డులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఆయా వార్డుల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ హరిత, కౌన్సిలర్లు ధన్‌రాజ్, బాలరాజు, శివలింగంగౌడ్, సునీల్, కుంట ఉదయశ్రీ, శ్రీలత, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ : సరూర్‌నగర్ చెరువును సుందరీకరించి, ఆహ్లాదకర వాతావరణం పెంపొందించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి సూచించారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా బుధవారం కార్పొరేటర్, డిప్యూటీ కమిషనర్ సుజాత సరూర్‌నగర్ చెరువులో చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగ ఏఈ రాంబాబు, అర్జున్, శానిటేషన్ డీఈ నీలిమ, గౌతమ్‌నగర్‌కాలనీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, రఘునందన్ పాల్గొన్నారు.


సరూర్‌నగర్ చెరువులో చేప పిల్లలను వదులుతున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ సుజాత

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్ట్ పెట్టిస్తా

- **మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ హెచ్చరిక**

సరూర్‌నగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో బీఆర్ఎస్ నేతలు కబ్జా చేసిన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని, ఇకపై కబ్జాదారుల ఆటలు సాగబోవని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టిస్తానని ఆయన హెచ్చరించారు. బుధవారం మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి ఆయన మీర్‌పేట్‌లోని సిర్లాహిల్స్, పెద్దచెరువు, అల్మాస్‌గూడ కోమటికుంట చెరువు తదితర ప్రాంతాలను సందర్శించి అక్కడి ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక దళిత రైతులు మాట్లాడుతూ తాము దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను కొందరు నేతలు బలవంతంగా లాక్కున్నారని, చెరువులను సైతం కబ్జా చేశారని ఆరోపించారు. తాము సాగు చేసుకున్న భూములను తమకే అప్పగించాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం కేఎల్లార్ మాట్లాడుతూ దళితుల భూములు దళితులకే చెందేలా చూస్తామని, తమ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్టుగా కాంగ్రెస్ హయాంలో దళితులకు ఇచ్చిన భూములను తిరిగి వారికే ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఒకవేళ భూములు తిరిగి ఇవ్వడానికి నిబంధనలు అడ్డువస్తే అక్కడి రైతులకు ఏం చేస్తే న్యాయం జరుగుతుందో చర్చించి, ఆ దిశలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, మాజీ జడ్పీటీసీ బంగారు సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, నాయకులు సామిడి గోపాల్‌రెడ్డి, పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, దాసరి బాబు, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, కీసరి యాదిరెడ్డి, బోయపల్లి వెంకట్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, రామిడి కృష్ణారెడ్డి, నవారు మల్లారెడ్డి, తీగల సాయినాథ్ రెడ్డి, ఎరుకలి రవిగౌడ్ పాల్గొన్నారు.


మీర్‌పేట్‌లో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న కేఎల్లార్, తీగల

రుణమాఫీకి తూట్లు పొడిచిన కాంగ్రెస్‌కు రైతులే బుద్ధి చెబుతారు

- **బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి**

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అనేక ఆంక్షలతో రుణమాఫీ హామీకి తూట్లు పొడిచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన సమయంలో రైతులే తగినబుద్ధి చెబుతారని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంపై బీజేపీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామంలో రైతు రచ్చబండ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన రైతు రచ్చబండలో ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ విషయంలో జీవో నంబర్ 567 పేరుతో అనేక ఆంక్షలు విధించి 60శాతం రైతులను రుణమాఫీకి రేవంత్ సర్కార్ దూరం చేసిందన్నారు. అందరికీ రుణమాఫీ జరిగిందని ఉదరకొడుతున్న కాంగ్రెస్ నాయకులు రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని రుణమాఫీ విషయంలో మోసపోయిన రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ చేతిలో మోసపోయిన తెలంగాణ.. రేవంత్‌రెడ్డి హామీలను నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచాడని ఆరోపించారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి రైతులను సంఘటితం చేస్తామన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్కా రవీందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిపల్లి అంజయ్యయాదవ్, పోరెడ్డి నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, నారాయణయాదవ్, రమాదేవి, మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్ పాల్గొన్నారు.


రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

చేనేత దుస్తులను ధరించి నేత కార్మికులకు అండగా నిలవాలి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లోని గాంధీయన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో జాతీయ చేనేత దశాబ్ది ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సంస్థల చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత దుస్తులను ప్రతి ఒక్కరూ ధరించి నేత కార్మికులకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జౌళిశాఖ విశ్రాంత రీజనల్ డైరెక్టర్ వెంకటేశం, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సంస్థల వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.


చేనేత కార్మికులను సన్మానిస్తున్న రాజేందర్‌రెడ్డి తదితరులు

చేనేత కార్మికులను ఆదుకోవాలి

వనస్థలిపురం : చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకుని, తమ అభివృద్ధికి కృషి చేయాలని భావనరుషి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు రాపోలు తిరుమలేష్ అన్నారు. భావనరుషి చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని వనస్థలిపురంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాపోలు తిరుమలేష్ మాట్లాడుతూ తెలంగాణలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు. ఎంతో కష్ట నష్టాలకు ఓర్చుకుని నేత కార్మికులు తమ వృత్తిని కొనసాగిస్తున్నారన్నారు. తమ కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం తమ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌నేత, సంఘం ప్రధాన కార్యదర్శి తిరందాసు నర్సింహనేత, నాయకులు తాటి ఎల్లయ్య, గుండు ప్రభాకర్‌నేత, సూర్యకళ, వి జయలక్ష్మి, శ్రీరంగం, జనార్దన్‌నేత పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం

అబ్దుల్లాపూర్‌మెట్ : చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్‌లో చేనేత కార్మికులను బీజేపీ మహిళ మోర్చా అధ్యక్షురాలు బొడిగె రమాదేవి, మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామసాని మోహన్‌రెడ్డి, శ్రీలత ఘనంగా సన్మానించారు.

రాష్ట్రస్థాయి జావెలిన్‌త్రోకు బాటసింగారం విద్యార్థులు ఎంపిక

అబ్దుల్లాపూర్‌మెట్ : జావెలిన్‌త్రో రాష్ట్రస్థాయి పోటీలకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం ప్రభుత్వ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ హెచ్‌ఎం మల్యాల యాదగిరి తెలిపారు. 9వ తరగతి చదువుతున్న ఈదులగంటి హారిక అండర్-14 విభాగంలో, పదవ తరగతి చదువుతున్న రమావత్ రాజేష్ అండర్-16లో, చిట్టోజు ఈశ్వర్ అండర్-18 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. ఈసందర్భంగా స్కూల్ విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం వారికి క్రీడా దుస్తులను అందజేశారు.

వ్యక్తి అదృశ్యం


సైదాబాద్ : ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉప్పరిగూడలో నివాసముండే జక్కుల యాదగిరి (63) ఈనెల ఒకటవ తేది ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ కోసం వెదికినా లభ్యం కాలేదు. దీంతో కుటుంబసభ్యులు మాదన్నపేట పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భిక్షపతిగౌడ్ కాంగ్రెస్‌కు చేసిన సేవలు చిరస్మరణీయం

- **స్పీకర్ గడ్డం ప్రసాద్**

కొత్తపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): లింగాల భిక్షపతిగౌడ్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. కొత్తపేట గ్రామవాసి డీసీసీ మాజీ అధ్యక్షుడు మాజీ సర్పంచ్ లింగాల భిక్షపతిగౌడ్ దశదిన కర్మ ఈవెంట్ విల్లా ఫంక్షన్ హాల్లో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం పాల్గొని భిక్షపతిగౌడ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడిగా భిక్షపతిగౌడ్ కాంగ్రెస్ పార్టీకి ఉత్తమ సేవలందించారన్నారు. ఆయన సేవలు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, మాజీ సర్పంచ్ గోల్కొండ మైసయ్య, మాజీ జడ్పీటీసీ కృష్ణగౌడ్, లింగాల నాగేశ్వరరావు, నాగోల్ సుధాకర్‌చారి, కట్టా ఈశ్వరయ్యగౌడ్, చిరంజీవి, వెంకటేష్‌గుప్తా, లింగాల రాహుల్‌గౌడ్, లింగాల కిషోర్‌గౌడ్, బిచినేపల్లి వెంకటేశ్వరరావు, డప్పు వెంకటేష్, రవికుమార్, పలు పార్టీల నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



సైదాబాద్ : రోడ్డుపై లేవలేని స్థితిలో అనారోగ్యంతో పడి ఉన్న ఓ మహిళను పోలీసులు ఆశ్రమానికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకేశ్వర్‌బజార్‌లోని శివశక్తిబజార్ సమీపంలో ఓ చెట్టు కింద ఓ గుర్తు తెలియని మహిళ(60) కొంతకాలంగా ఉంటుంది. ఈనెల ఒకటిన ఆమె లేవలేని స్థితిలో పడి ఉండడంతో పెట్రోలింగ్ పోలీసులు గమనించారు. ఆమె వివరాలు తెలియకపోవడంతో అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఆలేటి ఆశ్రమానికి తరలించారు. మహిళ మృతిచెందినట్లు ఆశ్రమ నిర్వాహకులు సైదాబాద్ పోలీసులకు తెలియజేశారు. మృతురాలి పేరు ఈశ్వరమ్మ అలియాస్ వెంకటేశ్వరమ్మగా స్థానికులు తెలిపారు.


ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్‌కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీటాప్స్, డిజైనర్ బ్లౌస్, లక్నోచికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి టాయ్స్, ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్నివర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9గంటల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.


అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

సంతోష్‌నగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతంగా యాఖత్‌పురా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ అన్నారు. బుధవారం కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ అధికారులతో కలిసి ఐఎస్‌సదన్ డివిజన్‌లో పర్యటించారు. బాక్స్‌డ్రైన్, నూతన సీసీ రోడ్ల పనులు, ఇతర అభివృద్ధి పనులు జాప్యం లేకుండా చూడాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ఏకాంబరం, డీఈ దేవేందర్, ఏఎంసీ వాసీద్దీన్, విద్యుత్ ఏఈ విజయకుమార్, అధికారులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు: పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 28వ డివిజన్‌లోని శ్రీమారుతీనగర్, చంద్రవిహార్‌కాలనీ, వసంత్‌విహార్‌కాలనీ, ప్రెస్‌కాలనీల్లో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్ సూర్లగంటి అర్జున్‌తో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఏఈఈ బిక్కూనాయక్, నాయకులు గట్టు బాలకృష్ణ, కె.నరేశ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను, కుంటలను కాపాడండి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న చెరువు, కుంటలను రక్షించాలని కోరుతూ బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకకు సీపీఎం నేతలు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని చెరువు, కుంటలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ తో పాటు నాలాలను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాలు చేస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ కలెక్టర్‌కు వివరించారు. కబ్జాలు జరుగుతున్నా సంబంధిత ఇరిగేషన్ అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కబ్జాలకు గురైన చెరువు, కుంటలను వెంటనే కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేడిపల్లి శ్రీశైలం, గుండె శివకుమార్, ముత్యాలు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పెద్దచెరువు పనులు చేపట్టాలి

వనస్థలిపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలతో పెద్దచెరువు లీకేజీ పనులు చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్‌లోని పెద్దచెరువు ప్రాంగణంలో రూ.4.5లక్షలతో చేపడుతున్న కొలను లీకేజీ పునరుద్ధరణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడి మృతి

సైదాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ పనులు చేస్తుండగా ఇనుప రాడ్‌కు విద్యుత్ తీగలు తగిలి కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన న్యూసైదాబాద్ కాలనీలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన అల్లాఉద్దీన్(35) కుటుంబంతో నగరానికి వలస వచ్చి కిషన్‌బాగ్‌లో నివాసముంటూ భవన నిర్మాణ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం న్యూసైదాబాద్ కాలనీలో భవన నిర్మాణ పనుల్లో భాగంగా ఇనుప రాడ్‌ను తీసుకుని వెళ్తుండగా ప్రమాదవశాత్తు అది విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.